# నూతన్ వినూత్న సేవ

'నవరసాలను బొమ్మలుగా గీయించాలని నాకు రెండు సంవత్సరాల క్రితం ఆలోచన వచ్చింది. ఆ వెంటనే గుర్తుకొచ్చారు బాపు...ఆయనైతేనే వీటిని కరెక్టుగా గీయగలరనిపించింది' అన్నారు నూతన ప్రసాద్.

'కళాకారులు నవరసాలు తెలియకుండా రాణించలేరు. అది అందరికీ తెలుసు. ఏదైనా మంచి హాస్య సన్నివేశం వస్తే మనం కూడా బాగా ఎంజాయ్ చేస్తాం. హాస్యం ఫలానా నటుడు ఎంత బాగా పండించాడు అనుకుంటాం. అలాగే మిగతా రసాలు కూడా. అయితే ఈ రసాలు ఎలా ఉంటాయో...మనకు ఇంత వరకు ఎక్కడా బొమ్మలు లేవు. ఆయా రసాలను బొమ్మల్లో చూపాలనే కృషి 'బాపు' గారి దయవల్ల విజయవంతమైంది' అని చెప్పారు ప్రసాద్.



ఇప్పటికే చాలా కేంద్రాలలో ఈ బొమ్మలను పెట్టడం జరిగింది కదా, ఎలాంటి స్పందన వచ్చిందన్నప్పుడు 'అది మాటల్లో చెప్పలేను. ముఖ్యంగా కళాకారుల ప్రతిస్పందన నా జీవితానికో తృప్తిని, మనోధైర్యాన్ని ఇచ్చాయి' అని ఆయన అన్నారు.

మీ లక్ష్యం ఏమిటి ? అన్నప్పుడు-

'బాపూ బొమ్మలను వీలయినంత ఎక్కువచోట్ల పెట్టి ప్రజలకు, కళాకారులకు అందుబాటులోకి తీసుకురావడమే నా జీవిత లక్ష్యం' అన్నారు.

మొదటిసారి వీటిని తయారు చేయించడానికి మీకు ఎంత ఖర్చు అయ్యింది, దీనిని మీరే భరించారా ? అని అడిగితే...

'వీటిని నాలుగు అడ్గుల ఎత్తు, రెండున్నర అడుగులు వెడల్పు సైజులో చేయించాను. తొమ్మిది బొమ్మలకు నాకు ముప్ఫయ్ అయిదు వేల రూపాయలు ఖర్చు అయింది. అయినా ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను.' అని నూతన్‌ప్రసాద్ అన్నారు.

ఇలా ఎందుకు చెయ్యాలనిపించింది ? అని అంటే...

'నాకు యాక్సిడెంట్ అయిన తర్వాత మానసికంగా చాలా నలిగిపోయాను. దానిని అధిగమించడానికి ఏదో ఒకటి చెయ్యాలనిపించింది. నవరసాల ఆలోచన వచ్చింది. దీనిని ఆచరణలో పెట్టాను. నా నుంచి మిగతా వాళ్ళు స్ఫూర్తి పొందాలన్న ధ్యయమే నన్నీ పని చేయడానికి ప్రేరేపించింది' అని చెప్పారు నూతన ప్రసాద్.